


# ఆనాటి అపురూప చిత్రాలు
## ఈనాటి సమగ్ర పరిచయాలు

- ప్రొ.డా.జ్ఞానేశ్వర రావు కె.వి.ఎస్



*సినిమా రంగంలో విజయావారి బేనర్‌కి ఒక ప్రత్యేకతవుంది. వారు పక్కా సినిమా స్క్రిప్ట్ తయారుచేసుకునిగాని చిత్రీకరణ మొదలుపెట్టే ప్రశ్నే లేకుండా ప్రతి  సంవత్సరం సంక్రాంతి కానుకగా సినిమాలు రిలీజు చేసేవారు. భవిష్యత్తులో ఎదురులేని హీరో, హీరొయిన్లుగా ఎదిగినప్రముఖులు, లబ్ధప్రతిష్ఠులు తొలిరోజుల్లో నెలవారీ జీతాలతో 'ఇగో ప్రాబలమ్స్' తలెత్తకుండా దర్శక, నిర్మాతలకి లోబడి క్రమశిక్షణతో ఒకే త్రాటిపై నడిచి పనిచేసేవారు. సాంకేతికబృందం సరేసరి–అంతా కలిసి ఒకే కుటుంబంలా మసలుకునేవారు. అది సినిమాల స్వర్ణ యుగం. అందువల్ల సినిమాచూస్తున్నంతసేపూ వినోదంతోపాటు ప్రేక్షకులు ఆయా పాత్రలతో తాదాత్మ్యంచెంది సన్నివేశపరంగా ఆయా అనుభూతులను నవరసభరితంగా పంచుకోవడం జరిగేది. పాటలుగాని, నృత్యాలుగాని అశ్లీలం చోటుచేసుకోకుండా సందర్భానుసారంగా, సాంప్రదాయరీతిలో పాలల్లో నీళ్ళలాగా కలిసిపోయి ఆహ్లాదాన్ని కలిగించేవి.*

*హాస్యం పాత్రోచితంగా కథాస్రవంతిలో కలిసిపారేది. వాస్తవికత,నాటకీయత, కాల్పనికత,సృజనాత్మకత సమపాళ్ళలో రంగరించినట్లుగా పదుగుపేకగా సాగేవి. ఒక దృశ్యకావ్యాన్ని ఆవిష్కరించడంలో నటీనటులు పోటీపడి నటించడమేగాక డైరెక్టర్ నుండి లైట్‌బోయ్  వరకు కథాచర్చల్లో పాల్గొని శ్రద్ధాసక్తులు చూపేవారు. 'జనం కోరేది మనం చేయాలి' అనే సంకల్పంతో జనరంజకంగా వినోదాన్ని అందించేవారు. 'షావుకారు' మొదలుకొని 'బృందావనం' వరకు  ఎన్నో సినిమాలు తదుపరి చిత్రాలకు ఒరవడిగా , గీటురాళ్ళగా వెలిశాయి.(బ్లాక్ బస్టర్ క్లాసిక్స్‌తో  పాటు కొన్ని ఫ్లాప్స్ కూడా జతగూడటం అనూహ్యం!)*

*అంతేకాక 'విజయా పతాక' సినిమాల్లోఎవరినీ నొప్పించకుండా సమకాలీన సాంఘిక సామాజిక సమస్యల ప్రస్తావన ఉండేది. పాటలు సందేశాత్మకంగా ఉండేవి. సంభాషణలు నిజజీవితానికి దర్పణం పట్టేవిగా మలచబడేవి. ఏ పాత్ర నిర్మాణంలోనూ అనౌచిత్యం కనిపించకపోగా, ఆ పాత్రలేనట్లు ఊహిస్తే లోటుగా,వెలితిగా, అసహజంగా అనిపించేది. ఆ 'జిగిబిగి' అంత పకడ్బందీగా ఉండేది. సంభాషణాచాతుర్యానికీ, చమత్కారాలకీ , సామెతలకీ, జాతీయాలకీ, లోకోక్తులకీ, నానుడులకీ కొదవలేదు. మాటలు,పాటలు సానబట్టిన చురకత్తుల్లా పదునుగా, మణిమాణిక్యాల్లా తళుక్కుమంటూ, కొత్త ఆవకాయఘాటులా చురుక్కుమంటూ, తేటతెనుగు తేనెలూరుతూ, భాషనేర్చేవాళ్ళకు  పాఠ్యగ్రంథాల్లా ఉండేవి. మచ్చుకి ఒక్క పొల్లుమాటకూడా కానరాకుండా ప్రసిద్ధరచయితలు శ్రద్ధ తీసుకునే వాళ్ళు. పాటలు రసగుళికలే! గాత్రశుద్ధిగల గాయనీ గాయకుల  గళాలనుండి జాలువారి అజరామరంగా ఆబాలగోపాలపు నాలుకలపై నర్తించేవి. కళ, ఫొటోగ్రఫీ, సినిమటోగ్రాఫీ బ్లాక్ అండ్ వైట్ రోజుల్లో కూడా అత్యున్నత ప్రమాణాల్లో అబ్బురపాటుగొలిపేవి. సాధారణ ప్రేక్షకుడిని కూడా సహజత్వంతో మొదలుపెట్టి, ఊహాలోకాల్లోకి తీసుకుపోయేవి.అంతర్లీనంగా సమాజానికి మేలుచేసే ఏదో ఒక సందేశం లేకుండా ఏ సినిమా ఉండేదికాదు.*

# పాతాళభైరవి – 1

ఉపోద్ఘాతం

1951లో విడుదలై సంచలనం రేపిన జానపద చిత్రాల మేలుబంతి. ఎన్.టి..రామారావు, ఎస్.వీ. రంగారావు, (సావిత్రి–నృత్య నాటకం)ల careers ని catapult చేసిన మేటి చిత్రం. ఈ కథ "అరేబియన్ రాత్రుల"–'అల్లావుద్దీన్ అద్భుత దీపం'–ని పోలివుందని చక్రపాణి భావించారు. కాని నిజానికి ఆ కథలకి మూలం "కథాసరిత్సాగరమని", దానికి మూలం గుణాఢ్యుని "బృహత్కథ" అని అరబ్బులే (వర్తకులు) వినమ్రంగా ఒప్పుకున్నారు.

--★0★--

కథ,సంభాషణలు, పాటలు: పింగళి నాగేంద్రరావు. ; చిత్రానుసరణ : కె.వి.రెడ్డి, కె.కామేశ్వర రావు; తారాగణం: ఎన్.టి.రామారావు, ఎస్.వీ.రంగారావు, సి.ఎస్.ఆర్, రేలంగి, బాలకృష్ణ, పద్మనాభం, మాలతి, టి.జి.కమల, లక్ష్మీకాంతం, హేమలతమ్మారావు, గిరిజ, సురభి కమల, చిట్టి, ( సావిత్రి–నృత్య నాటికలో) ; డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ: మార్కస్ బార్ట్లే; సంగీతం: ఘంటసాల; ప్లేబాక్: ఘంటసాల, పి.లీల, జిక్కి.

★★★

ఉజ్జయినీనగర కోటగోడకానుకునివున్న పూలతోటలో యువకులు రాముడు, స్నేహితుడు అంజి కర్రసాము చేస్తూవుంటారు.

రాముడితల్లి శాంతమ్మ తోటలో గుడిసె చేరుకుని పూలబుట్ట సర్దుతూ: మొదలుపెట్టారూ దరువు? ఒరే రామూ–కర్రసామూ మీరూనూ. వస్తున్నావుండండి. –చూరులో గడకర్ర తీసుకుని వాళ్ళమధ్యకి వెళ్తుంది.:తప్పించుకుంటావా ?—–రాము కర్రతో దెబ్బలు అడ్డుకుంటూ ఉండటం సాముగా పరిణమిస్తుంది.

అంజి: భలే పిన్నీ, భలే .బావుంది బావుంది.

తల్లి: ఏం ఏడిపిస్తున్నావురా? ఏం తిప్పలు పెడుతున్నావురా? –తలబాదుకుని కర్ర పారేస్తుంది.

రాముడు కర్ర తల్లిచేతికిచ్చి వంగి: ఏమీలేదే అమ్మా. ఇదిగో. ఊఁ. కొట్టవే. కొట్టు.

తల్లి: ఓరి భగవంతుడా. ఒక కొడుకునిమ్మంటే ఈ రాక్షసుడినిచ్చావేమిరా?

అంజి: రాక్షసుడంటే రక్షించేవాడే.

తల్లి: రారా.—–రాము చెవి పట్టుకుని, అంజినికూడా పిలిచి..రారా.

రాము: అబ్బబ్బబ్బ. నొప్పెడుతోంది వదలవే. (గుడెసెలోకి వస్తారు)

తల్లి: రాజకుమారి వచ్చే వేళయింది. లోపలికిపొండి కోతి వెధవల్లారా.—–లోపలపెట్టి తడిక గొళ్ళెం పెడుతుంది. (కూత) ఒరే అంజిగా కూతలు కూశావంటే పీకపిసికేస్తాను. జాగ్రత్త. –– లోపల వాళ్ళిద్దరూ బట్టలు పూర్తిగా వేసుకుని వెదురు తడిక గొళ్ళెంతీసి (అది ఆ కొంటెకోణంగిలని ఆపుతుందా? ) నిశ్శబ్దంగా బైటపడతారు. బయట అరుగుపై తల్లి చేతిబుట్టలో పూలు సర్దుతూ వుంటుంది. వాళ్ళు తోటలో దాగి ఎదురుచూస్తున్న రాకుమారి ఇందుమతి చెలికత్తెలతో తోటలోకి ప్రవేశిస్తుంది.

పాట

పల్లవి : తీయని ఊహలు హాయిని గొలిపే – వసంత గానమె హాయీ వసంత నాట్యమె హాయ్ హాయ్ "తీయ"

ఇందు : చివురుల దాగి తీవెలనూగి–పూవులు ఘుమఘుమ నవ్వగా
వనియంతా పరిమళించెనే మనసెంతో – పరవశించెనే "తీయ"
గిలిగింతలు చెరలాడి – చిరుగాలి సరాగము చేయగా
వనియంతా ఝల్ ఝలించెనే –తనువెంతో పులకరించెనే "తీయ"
క్రొత్తరాగమున కుహూ, కుహూమని మత్తిలి కోయిల కూయగా
వనియంతా రవళించేనే – నన్నెంతో మురిపించెనే "తీయ"

============

చాటున రాముడు పరవశించి ముందుకు వస్తే అంజి: ఎక్కడికీ? ముందుకు వెళ్తే ప్రాణం పోతుందిసుమా!

రాము: ప్రాణం పోతేనేమిరా..ఒక్కసారి రాజకుమారి పక్కన ...

అంజి: ఊఁహూఁ.

రాము: నిలబడితే చాలురా.

అంజి: అమ్మరోయ్!! –ఇద్దరూ మొక్కలచాటున వంగి నక్కుతారు. తల్లి బుట్ట పట్టుకుని బాటవెంట ముందుకు సాగుతుంది.

★★★

ఉజ్జయినీ సత్రం సావడిలో యక్షగాన కళాకారుల బృందం వినోదంతోపాటు వీర సాహస గాథల ప్రేరణనిస్తూ——

పాట

తథింతధిక తథింతధిక తథింతధిక
ఓఓఓ –ఇతిహాసం విన్నారా ఆ అతిసాహసులేవున్నారా –హెచ్చరికో హెచ్చరిక–
(రాముడు,అంజి వచ్చి ప్రేక్షకులమధ్య సత్రం అరుగుపై చేరుతారు)...
1.యక్షులనిధులు అందరివండీ– నిక్షిప్తాలవి పాతాళంలో
రక్షవుంటదీ లక్షనిధులకూ –రక్ష సాహసికి దక్కేనండీ...
2.జగతి సాహసం జయకథకాగా –యుగయుగానికొక కథానాయకుడు
జగన్మంగళం సాధించేనూ– దిగంతమంతా వెలిగేనూ...
3. నారాచానికి సూటిగ ఎగిరి– దూకే సాహస విక్రమార్కుడు
మట్టిబొమ్మలను మహారణానికి దండునడిపిన శాలివాహనుడు...
విజయసాహసపు వింత కథలతో–ఉజ్జయినీపురి ఉజ్జ్వలించగా
4.నాటివారివలె నేటివారును చాటగలరయా సాహసమంటూ
చాటుమాటుగా కథనడిపించగ –నేటికెవరయా కథానాయకుడు?

నీవా?నీవా? మరి నీవా?...

(రాముణ్ణి సాహసిగా చూపిస్తాడొక ప్రేక్షకమిత్రుడు . రాముడు సరదాగా తర్జనితో బెదిరిస్తాడు)

================

పాటపూర్తికాగానే 'రాణీగారి తమ్ముడు– రాణీగారి తమ్ముడు' అని కేకలు. అతడు భటులతోపాటు ప్రవేశం.

రాణీగారి తమ్ముడు: ఏవిఁటీ సంత? ఏం చేస్తున్నారు మీరంతా?

కళాకారిణి: ఏదో.కాస్త వినోదంగా...

రాణీగారి తమ్ముడు: వినోదమేమిటి? తప్పుతప్పు.( జనంలోకి వెళ్ళిన ఊతపదం) ప్రమాదం.పరమ ప్రమాదం. పన్ను పుచ్చుకోండి. –భటులు: పన్నిచ్చుకో.

రాణీగారి తమ్ముడు: ఎవరోయ్ నువ్వు?

వాడు: కొత్తవాణ్ణండి.

రాణీగారి తమ్ముడు: కొత్తవాడేమిటి?తప్పుతప్పు. పాతవాళ్ళే పాతుకుపోవాలి. –భటులు అతని దగ్గర మూట లాక్కుంటారు. రాణీగారి తమ్ముడు ముందుకుపోయి——నీదేవూరు?

పరదేశి:పారశీకమండి.

రాణీగారి తమ్ముడు: పారశీకమేవిఁటి?తప్పుతప్పు. పరకసం.పరకసం.——వాడి టోపీ లాక్కుంటాడు. టోపీబాగుంది.——భటులతో–పట్టుకోండిరా.——(రాముడికి కోపం పెరుగుతూవుంటుంది.) రాణీగారి తమ్ముడు:   నేలపై కూర్చున్న ముసలితాతని తన్ని: ఏవిఁటిది?

వాడు: పాత్ర బాబూ.

రాణీగారి తమ్ముడు: పాత్రేమిటి? తప్పుతప్పు. పుచ్చుకోండిరా.

కళాకారిణి–అసహ్యంతో: ఈ పోతరాజుని మొరగకుండా తరిమికొట్టలేరూ? ఎవ్వరికీ సాహసం లేదూ?

రాణీగారి తమ్ముడు: ఏవిఁటే? కటారిలా కస్సుబుస్సుమంటున్నావు? –రాళ్ళు వచ్చితగుల్తాయి. :అబ్బ! ఎవరు నన్ను కొట్టేరు? తప్పుతప్పు.ఎవడు వాడు?

రాముడులేచి ముందుకు వస్తాడు : నేను రాముడిని. తీసుకున్నవన్నీ కక్కించండిరా.

రాణీగారి తమ్ముడు: మీదికొస్తావేమిటి? నన్నుచూసి జడవాలి. నేను రాణీగారి తమ్ముడుని. వీరధీరశూరసేనుణ్ణి. –అంజి వాడిని రాముడి వైపుకి తోస్తాడు.

రాముడు వాణ్ణి పట్టుకుని: రాణీగారి తమ్ముడువా? దోపిడీకి వచ్చావ్?

రాణీగారి తమ్ముడు: నన్ను కొడతావేమిటి? తప్పుతప్పు.

అంజి: అంతే.

రాముడు: వినోదం ప్రమాదమా? పన్ను కావాలీ? –జనం భటులను తన్ని వస్తువులు స్వాధీనం చేసుకుంటారు.

రాణీగారి తమ్ముడు: ఒరే భటులారా... ఉండు రాజుగారితోచెప్పి, తప్పు తప్పు, మా బావగారితో చెప్పి నీ తల తీయిస్తానుండు. –వచ్చిన ద్వారం గుండా బైటికి పోతాడు. భటులతోసహా.

కళాకారిణి: రాముడితో: సాహసివి. ఉజ్జయిని పరువు నిలబెట్టావు. ఇదుగో రక్ష. –ఆశీర్వదించి రక్ష కడుతుంది. విజయీభవ.దిగ్విజయీభవ. – రాముడికి కానుకలు, జయజయధ్వానాలు.

(సశేషం)

# COMMENTS